సాక్షి కర్నూలు

గురువారం । 9 । నవంబర్ । 2023



విగ్రహాల బహూకరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ప్రచార రథానికి అవసరమైన సోమస్కందమూర్తి ఉత్సవ విగ్రహాలను బుధవారం వైజాగ్‌కు చెందిన మురళీకృష్ణ దంపతులు బహూకరించారు.



పుడమికి పుత్తడి వర్ణం

గడివేముల: వరిపైరు కోతకు వచ్చి పసిడి రంగులో కనిపిస్తోంది. పెసరవాయి గ్రామ సమీపంలో భానుడి కిరణాలతో పుడమి పుత్తడి వర్ణం అద్దుకుని కనువిందు చేసింది.



ఆధ్యాత్మిక శోభితం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 32 నూతన దేవాలయాలు నిర్మిస్తున్నారు. ఇందు కోసం టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.3.20 కోట్ల నిధులను విడుదల చేసింది.

IIలో▸

న్యూస్‌రీల్

'నాడు-నేడు' స్కూళ్లకు నిర్వహణ నిధులు

- రూ.30.47 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

కర్నూలు సిటీ: నాడు- నేడు కింద అభివృద్ధి చెందిన 594 పాఠశాలలకు రూ.30.47 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులను స్కూల్ పేరెంట్స్ కమిటీ ఖాతాల్లో జమ చేశారు. నిధుల వినియోగంపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నాడు-నేడు కింద చేపట్టిన పనులకు కాకుండా ఇతర అవసరాల కోసం ఖర్చు చేయకూడదు. మౌలిక సదుపాయాల్లో భాగంగా ప్రభుత్వం సరఫరా చేసి వారంటీ ఉండే వాటికి కాకుండా వారంటీ లేని వాటికి మరమ్మతులకు ఈ నిధులను వినియోగించాల్సి ఉంది. పేరెంట్స్ కమిటీలతో సమావేశాలను నిర్వహించి తీర్మానాలు చేసిన మేరకు పనులు చేయాల్సి ఉంటుంది. సమావేశాల్లో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్, విద్యా సహాయకులు పాల్గొనాల్సి ఉంటుంది.

18న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18న ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు సీఈఓ జి.నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సమావేశ భవనంలో నిర్వహిస్తున్న సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యవసాయం,గృహ నిర్మాణ శాఖలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమావేశానికి కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు, ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ సభ్యులు,ఎంపీపీలు హాజరుకావాలని సీఈఓ కోరారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు సిటీ: జిల్లాలో బుధవారం విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నిరసనగా వామపక్ష, ప్రజా, కార్మిక సంఘాలు చేపట్టిన నిరాహార దీక్షలు వెయ్యి రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. కర్నూలులో విద్యార్థి సంఘాల నాయకులు ర్యాలీగా కలెక్టరేట్ వరకు వచ్చి గాంధీ విగ్రహం ఎదుట ఆందోళన చేశారు. వీరికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మద్దతు ఇచ్చారు. విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆలోచనలు చేయడం చాలా దుర్మార్గం అని అన్నారు. నిరసనలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అహోబిల దాస కార్యక్రమం



బాచేపల్లెలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అహోబిలం ప్రధానార్చకులు

ఆళ్లగడ్డ: మండలంలోని బాచేపల్లె గ్రామంలో అహోబిల దాస కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. హిందూ ధర్మం, శ్రీ వైష్ణవ సంప్రదాయ ప్రచారంలో భాగంగా అహోబిలం మఠం 46వ పీఠాధిపతి పర్యవేక్షణలో అహోబిల దాస కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక యాగశాలలో ఉత్సవ మూర్తులు లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లను కొలువుంచి పుణ్యాహవాచనం చేశారు. అనంతరం సుదర్శన హోమం నిర్వహించారు.

యంత్ర సేవ.. రైతుకు తోవ

వ్యవసాయ యాంత్రీకరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వైఎస్ఆర్ యంత్రసేవ పథకం కింద రైతు భరోసా కేంద్రాల వారీగా అధునాతన యంత్ర పరికరాలతో కస్టమ్ హయ్యరింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే జిల్లాలో వేలాది మంది రైతులు యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయంలో రాణిస్తున్నారు.



ట్రాక్టర్‌తో దుక్కిదున్నుతున్న దృశ్యం

- ఆర్‌బీకేల్లో కస్టమ్ హయ్యరింగ్ సెంటర్ల ఏర్పాటు
- రైతులకు అందుబాటులో ట్రాక్టర్లు, ఇంప్లిమెంట్స్, కంబైన్డ్ హార్వెస్టర్లు
- జిల్లాలో రూ.47.81 కోట్ల విలువైన యంత్ర పరికరాల పంపిణీ
- రూ.17.35 కోట్ల సబ్సిడీ అందించిన రాష్ట్ర ప్రభుత్వం
- తక్కువ ఖర్చుతో అద్దె ప్రాతిపదికన యంత్రాలను వినియోగిస్తున్న సన్న, చిన్నకారు రైతులు
- వ్యవసాయంలో 80 శాతానికి పెరిగిన యాంత్రీకరణ

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా కస్టమ్ హయ్యరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి, వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా సబ్సిడీపై యంత్రాలను, పరికరాలను అందజేస్తోంది. గ్రూపుల నుంచి రైతులు తక్కువ అద్దెకు యంత్రాలను తీసుకొని వినియోగించుకునే వెసులుబాటు ఉంది. దీంతో గతంతో పోలిస్తే జిల్లాలో వ్యవసాయ యంత్రాల వినియోగం పెరిగింది. 2018–19 వరకు వ్యవసాయంలో యాంత్రీకరణ 20 శాతం మాత్రమే ఉండగా.. నేడు వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం అమలుతో 80 శాతం వరకు పెరిగింది.

సాగు సులభతరం

జిల్లాలో 466 రైతుభరోసా కేంద్రాలు ఉండగా.. అన్ని చోట్ల కస్టమ్ హయ్యరింగ్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలోనే రైతులకు అవసరమైన అన్ని రకాల యంత్ర పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ట్రాక్టర్లు, ట్రాలీలు, రోటావేటర్లు, ఐదు మడకల నాగలి, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్, మల్టీ క్రాప్ థ్రెసర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు, కాటన్ షెడ్డర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లను రైతుమిత్ర గ్రూపుల ద్వారా రైతుల ముంగిటకే తెచ్చారు. ఏఏ ప్రాంతాల్లో ఏఏ పంటలు సాగు చేస్తున్నారు... ఏఏ యంత్రపరికరాలు అవసరమో గుర్తించిన వాటిని ప్రభుత్వం సరఫరా చేసింది. యాంత్రీకరణతో సాగు సులభతరం అయ్యింది. దుక్కి దున్నడం మొదలు కోతలు, పంట నూర్పిడి వరకూ యంత్రాలను వినియోగిస్తున్నారు. రోజుల తరబడి జరిగే పనులను గంటల్లోనే పూర్తి చేస్తున్నారు. దుక్కి దున్నేందుకు ట్రాక్టర్లు, మినీట్రాక్టర్లు, రోటావేటర్ల వినియోగం పెరిగింది. వరినాట్లకు డ్రమ్ సీడర్లు వాడుకలోకి వచ్చాయి. కోత మిషన్లు, పంటనూర్పిడి యంత్రాలు వ్యవసాయాన్ని మరింత సులభతరం చేశాయి.

బ్యాంకుల ద్వారా రుణాలు

గతంలోయంత్రాలకు వాటి యాజమానులు విపరీతమైన అద్దె వసూలు చేసేవారు. దీంతో పెట్టుబడి ఖర్చులు పెరిగి రైతులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్లు(సీహెచ్‌సీ)లను ఏర్పాటు చేసింది. గ్రూపులో 5 నుంచి ఆరుగురు అన్నదాతలను సభ్యులుగా ఎంపిక చేసి వారికి బ్యాంకుల ద్వారా రుణాలను అందిస్తూ వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రాయితీపై వ్యవసాయ యంత్ర, పరికరాలను అందిస్తోంది. ఈ యంత్రాలను గ్రూపు సభ్యులు వినియోగించుకోవడంతో పాటు తమ పరిధిలోని రైతులకు తక్కువ మొత్తానికి అద్దెకు ఇస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది రూ.47.81 కోట్ల విలువ కలిగిన యాంత్ర పరికరాలను పంపిణీ చేశారు. యాంత్రీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.17.35 కోట్లు సబ్సిడీ విడుదల చేసింది. జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీహెచ్‌సీ ఏర్పాటుకు అవసరమైన రుణ సదుపాయం కల్పించింది. ఏఏ ప్రాంతాల్లో ఏఏ పంటలు సాగు చేస్తున్నారు... ఏఏ యంత్రపరికరాలు అవసరమో గుర్తించిన వాటిని ప్రభుత్వం సరఫరా చేసింది.



యంత్రంతో సేద్యం చేస్తూ...

రాజకీయాలకు అతీతంగా ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద సీహెచ్‌సీలను మంజూరు చేస్తోంది. రైతులు ఐదుగురు కలసి రైతు మిత్ర గ్రూపుగా ఏర్పడాల్సి ఉంది. కన్వీనర్, కో-కన్వీనర్ పేరుతో జాయింట్‌గా బ్యాంకు ఖాతా ప్రారంభిస్తారు. రైతుమిత్ర గ్రూపులు ముందుగానే సబ్సిడీ అమౌంటు చెల్లించి యూనిట్‌ను గ్రౌండింగ్ చేసుకోవాలి. తర్వాత ప్రభుత్వం రైతుమిత్ర గ్రూపుల బ్యాంకు ఖాతాలకు సబ్సిడీ విడుదల చేస్తుంది. టీడీపీ హయాంలో రైతురథం పేరుతో ట్రాక్టర్లు పంపిణీ చేశారు. ఒక్కటి కూడా నిజమైన రైతుకు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. పార్టీ కార్యకర్తలకు మాత్రమే ట్రాక్టర్లు పంపిణీ చేయడం గమనార్హం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారదర్శకంగా కస్టమ్ హయ్యరింగ్ సెంటర్లు పంపిణీ చేస్తుండటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

యంత్రాల పూర్తి ధర, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వివరాలు..

యంత్రం	మంజూరైనవి	పూర్తి ధర	సబ్సిడీ(రూపాయల్లో)
ట్రాక్టర్లు	330	25,17,84,307	9,64,12,998
వివిధ రకాల పరికరాలు	756	19,36,92,648	6,65,93,135
కంబైన్డ్ హార్వెస్టర్లు	12	3,26,63,697	1,05,60,000
మొత్తం	1,098	47,81,40,652	17,35,66,133

ఉపయోగాలు ఇవీ..

- వివిధ యంత్రాలతో పోలిస్తే కంబైన్డ్ హార్వెస్టర్ల విలువ ఎక్కువ. వీటిని ప్రధానంగా వరి కోత, నూర్పిడికి వినియోగిస్తారు. కంబైన్డ్ హార్వెస్టర్ల విలువ రూ.25 లక్షలు ఉంటుంది. జిల్లాకు వీటిని 12 కేటాయించారు.
- జిల్లాలో పత్తి సాగు ఎక్కువగా ఉంది. వివిధ మండలాల్లోని రైతుమిత్ర గ్రూపు నిర్వాహకులు ప్రధానంగా కాటన్ షెడ్డర్‌లను ఎంపిక చేసుకున్నారు. పంటలో పత్తి తీయడం పూర్తి అయిన తర్వాత కట్టెలను తొలగించడం పెద్ద సమస్యగా మారుతోంది. కాటన్ షెడ్డర్ పత్తి కట్టెలను పూర్తిగా తొలగించి, పొడి చేసి భూమిపై చల్లుతుంది. దీనిని రోటావేటర్ ద్వారా భూమిలో కలిపేస్తుంది. నేలలో పత్తి కట్టెల పొడి కుళ్లి సేంద్రియ ఎరువుగా మారుతుంది. దీనిని కంది పంటకు కూడా వినియోగిస్తారు. దీని యూనిట్ కాస్ట్ రూ.2.46 లక్షలు ఉంది. ఇందులో గ్రూప్ వాటా 50 శాతం, లోన్ 50 శాతం ఉంటుంది. కల్లూరు మండలంలో వీటి వినియోగం ఎక్కువగా ఉంది.

పెరిగిన వినియోగం



వ్యవసాయంలో ఉత్పాదకతను పెంచుకునేందుకు, పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకునేందుకు యంత్రాల అవసరం పెరిగింది. దీంతో జిల్లాలోని 466 ఆర్‌బీకేల్లో వైఎస్ఆర్ యంత్రసేవ పథకం కస్టమ్ హయరింగ్ సెంటర్లు ఏర్పాటు చేశాం. యాంత్రీకరణ కోసం ప్రభుత్వం ఈ ఏడాది రూ.17.35 కోట్ల సబ్సిడీ ఇచ్చింది. ఆర్‌బీకే స్థాయిలోనే ట్రాక్టరులతో సహా అన్ని రకాల పరికరాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నాం. దీంతో రైతులు తక్కువ బాడుగతో యంత్రపరికరాలను వినియోగించుకుంటున్నారు. – పీఎల్ వరలక్ష్మి, డీఏవో, కర్నూలు

రైతుకు ఎంతో మేలు



2022–23లో గ్రామానికి కస్టమ్ హయ్యరింగ్ సెంటరు మంజూరైంది. రోటోవేటరుతో పాటు పలు పరికరాలు రైతులకు అందుబాటులోకి వచ్చాయి.గతంలో ఇతర ప్రాంతాల నుంచి అద్దెకు తెచ్చుకోవాల్సి వచ్చేది. అద్దెలు కూడా ఎక్కువగా ఉండేవి. మాకు 6 ఎకరాల పొలం ఉంది. 80 శాతం పనులకు యాంత్రాలనే వినియోగిస్తున్నాం. దీంతో పనుల్లో వేగం పెరగింది. సమయం ఆదా అవుతోంది. పెట్టుబడి వ్యయం తగ్గుతోంది. గ్రామానికి కస్టమ్ హయ్యరింగ్ సెంటరు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞత చెబుతున్నాం.

– దస్తగిరి, గుంద్రేవుల, సి.బెళగల్ మండలం

నేటి నుంచి జనంలోకి వైఎస్ఆర్‌సీపీ

- జిల్లా అంతటా 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం
- ప్రతి ఇంటికీ వెళ్లి పలకరించనున్న శాసన సభ్యులు
- చేసిన మేలును ప్రజలకు వివరించనున్న పార్టీ నేతలు
- కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గురువారం నుంచి జనంలోకి వెళ్లనుంది. 'వై ఏపీ నీడ్స్ జగన్' (ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు అవసరం) అనే కార్యక్రమంతో ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటికీ వెళ్లనున్నారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు తమ పరిధిలోని గ్రామాలు, వార్డుల్లో పర్యటించనున్నారు. ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలసి వేడుకలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేను విన్నాను.. నేను ఉన్నాను

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు ప్రతిపక్ష నేత హోదాలో సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజల కష్టాలు తెలుసుకున్నారు. 'నేను విన్నాను.. నేను ఉన్నాను' అని అభయమిస్తూ మేనిఫెస్టోను రూపొందించారు. 2019 ఏప్రిల్‌లో జరిగిన సాధారణ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిచి అధికారంలోకి వచ్చిన తక్షణమే హామీల అమలుకు ప్రాధాన్యత ఇచ్చారు. మూడు నెలల్లో 80 శాతానికి పైగా ఆచరణలో పెట్టి.. నాలుగున్నరేళ్లలో 99 శాతం పూర్తి చేసి చరిత్ర సృష్టించారు. అవ్వాతాతల పింఛన్ పెంపు, రైతు భరోసా, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, ఆరోగ్య శ్రీ, పేదలకు ఇళ్లు, ఆసరా, నాడు- నేడు, విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, వాహన మిత్ర.. ఇలా అనేక పథకాలు అమలు చేస్తున్నారు.

నాడు పైరవీలు.. నేడు అర్హతే ప్రామాణికత

టీడీపీ హయాంలో ప్రభుత్వ పథకాల మంజూరుకు పైరవీలు ఎక్కువగా ఉండేవి. జన్మభూమి కమిటీలు సిఫార్సు చేయడం, ఆయా కమిటీలకు మామూళ్లు ఇవ్వడం, టీడీపీకే ఓటు వేశారని ధ్రువీకరించడం జరిగిన తరువాతే పథకాలకు సిఫార్సు చేసేవారు. ప్రస్తుతం వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో ఎలాంటి సిఫార్సులకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తున్నారు. అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి నగదును జమ చేస్తున్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజల గమ్మం వద్దకే ప్రభుత్వ పథకాలు వస్తున్నాయి.

చంద్రబాబు వంచన..

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికల సమయంలో సుమారు 600 హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం సాధ్యం కాక చేతులెత్తేశారు. రైతు, డ్వాక్రా రుణాల మాఫీతో తదితర హామీలను అమలు చేయలేకపోయారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 2014లో కర్నూలులో నిర్వహించిన వేడుకల్లో జిల్లాకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమంలో చంద్రబాబు మోసాలను వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు వివరించనున్నారు. గత, ప్రస్తుత పాలనను వివరించి పది ప్రశ్నలకు సమాధాలు తీసుకొని, వారితో స్టాంప్ వేయించనున్నారు.

పేదల మనస్సులో సీఎం జగన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య

- నేటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'తో జనం ముందుకు
- విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్ఆర్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల మనస్సు దోచుకున్న నాయకుడని ఆ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల కష్టాలు తెలుసుకునేందుకు పాదయాత్ర చేసి వారి సంక్షేమానికి కేవలం రెండు పేజీల మేనిఫెస్టో రూపొందించారన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే వాటిని అమలు చేస్తూ ఇప్పటికే 99శాతం పూర్తి చేసి చరిత్ర సృష్టించారన్నారు. 2014లో ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేయలేక నీరుగార్చడంతో పాటు మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించాడన్నారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కడంతో పాటు ప్రజలను మోసం చేయడం, వెన్నుపోటు రాజకీయాలకు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకొని ఆయన చేస్తున్న నీచ రాజకీయాలను ప్రజలు మరోసారి నమ్మి మోసపోయే స్థితిలో లేరన్నారు. బీజేపీలో ఉంటూ పురందేశ్వరి టీడీపీని అధికారంలోకి తెచ్చేందుకు పనిచేస్తున్నారని, అదే తరహాలో పవన్ కూడా బాబును పల్లకీలో మోస్తున్నాడన్నారు. ఈనేపథ్యంలో 2019 నుంచి సీఎం జగన్ సంక్షేమ పాలనను వివరించేందుకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంతో ప్రజల ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ 175 స్థానాల్లో గెలుపు సాధించడం తథ్యమని, జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు.

– అనంతరం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ పేదల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం జగన్ అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలతో పాటు పదవులు, స్థానిక సంస్థల్లో రాజకీయ అవకాశాలు ఇచ్చి సమాజంలో గుర్తింపు తెచ్చారని వెల్లడించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఇంజినీర్లపై కలెక్టర్ ఆగ్రహం

- పనితీరు మార్చుకోవాలని హెచ్చరిక
- సాతనూరు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): సిమెంట్, స్టీల్, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నా.. పది రోజులుగా ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించడం లేదని హౌసింగ్ ఇంజినీర్లపై జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్షించారు. తుగ్గలి, ఆలూరు, ఆదోని, పెద్దకడబూరు మండలాలతోపాటు ఆదోని అర్బన్‌లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఎలాంటిపురోగతి లేదన్నారు. హౌసింగ్‌కు సంబంధించి ప్రతి అంశంలో కోడుమూరు మండలం వెనుకబడి ఉండడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కోసిగి మండలంలోని సాతనూరు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ తీవ్ర నిర్లక్ష్యంతో పనిచేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. సచివాలయాల్లో పది కంటే ఎక్కువ ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలు ఉంటే వారం రోజుల్లో పురోగతి కనిపించాలన్నారు. ఆదోని, పత్తికొండ, కృష్ణగిరి, తుగ్గలి, కర్నూలు, కల్లూరు, గూడూరు, సి బెళగల్, కౌతాళం మండలాల్లో పూర్తి చేసిన ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను సంబంధిత శాఖలకు స్వాధీనం చేయాలన్నారు. చిప్పగిరి, హొళగుంద మండలాల్లో అంగన్‌వాడీ పాఠశాలల తనిఖీలు తక్కువగా చేశారని, పురోగతి కనిపించాలన్నారు. కల్లూరు, కోడుమూరు, పత్తికొండ, కృష్ణగిరి, దేవనకొండ, వెల్దుర్తి, ఆస్పరి మండలాల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు ఉపాధి పనులను కల్పించడంలేదని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఓ జి. భారతి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

కరువు మండలాల్లో అదనంగా 50 పనిదినాలు


- డ్వామా పీడీ అమరనాథ్ రెడ్డి



జూమ్ కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో కరువు ప్రాంతాలుగా ప్రకటించిన అన్ని మండలాల్లో ఉపాధి కూలీలకు అదనపు పని దినాలు కల్పిస్తున్నట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. జిల్లాలో కర్నూలు రూరల్, తుగ్గలి మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన తన కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఏపీవోలు, ఏపీడీలు, ఈసీలతో మాట్లా డారు.అన్ని కరువు మండలాల్లో అదనంగా కుటుంబానికి 50పనిదినాలు కల్పిస్తున్నామని, ఈ విషయాన్ని పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సగటున రూ.265 వేతనం పొందేలా చూడాలన్నారు.





జలాధివాసం వీడుతున్న సంగమేశ్వరాలయం

సంగమేశ్వరాలయం కనువిందు

కొత్తపల్లి: సంగమేశ్వరాలయం కృష్ణా జలాల నుంచి బయల్పడుతున్న దృశ్యం కనువిందు చేస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక పలు ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు కృష్ణా జలాల మధ్యలో ఓ ద్వీపాన్ని తలపిస్తూ.. నీటితో తేలియాడుతుందా అన్నట్లు ఉన్న సంగమేశ్వరాలయం, పక్కనే నల్లమల అటవీ అందాలను చూసి మంత్ర ముగ్ధులవుతున్నారు. బుధవారం కృష్ణా జలాల్లో పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ సంగమేశ్వర దీపం కార్యక్రమం నిర్వహించారు.

18 మండలాల్లో వర్షం

- గూడూరులో 43.4 మి.మీ వర్షపాతం
- ఈ నెల 15 వరకు శనగ సాగుకు అనుకూలం

కర్నూలు(అగ్రికల్చర్): ఆలస్యంగానైన కొన్ని మండలాల్లో కొంత ఆశాజనకంగా వర్షాలు పడటంతో రబీ సాగుకు అవకాశం ఏర్పడింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా 40 శాతం సబ్సిడీపై జిల్లాలో దాదాపు 48వేల క్వింటాళ్ల శనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఇటీవలి వరకు వర్షాలు లేకపోవడంతో రబీలో ప్రధానమైన శనగ, జొన్న, ధనియాలు తదితర పంటల సాగులో పురోగతి లేకపోయింది. ఇప్పుడిప్పుడే అక్కడక్కడ వర్షాలు కురుస్తుండటంతో విత్తన పనులు ఊపందుకుంటున్నాయి. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు 18 మండలాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా గూడూరులో 43.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ నెల 15 వరకు శనగ సాగు చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. కాగా నవంబర్ నెల సాధారణ వర్షపాతం 29 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 26.3 మి.మీ వర్షపాతం నమోదైంది. ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంటకు ఈ వర్షం ఊపిరి పోసినట్లయింది.

ప్రాంతం	వర్షపాతం(మి.మీ.)
కల్లూరు	37.4
ఆస్పరి	34.6
గోనెగండ్ల	27.2
ఆదోని	13.2
హోలహాల్వి	12.4
పెద్దకడుబూరు	12.4
చిప్పగిరి	10.8

క్లుప్తంగా

ప్రతి రైతుకు ఈ-క్రాప్ బుకింగ్ రసీదులు



మద్దికెర మండలంలో రైతులకు అందించిన రసీదులు

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ రసీదుల జారీకి వ్యవసాయ శాఖ శ్రీకారం చుట్టింది. 10,17,374 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. అయితే 9,73,650 ఎకరాలకు సంబంధించి 3,25,851 మంది ఈ-కేవైసీ ద్వారా సాగు చేసిన పంటలను ధృవీకరించారు. ప్రతి రైతు మొబైల్ ఫోన్‌కు నమోదు చేసిన పంటలకు సంబంధించిన వివరాలను ఎస్ఎంఎస్ ద్వారా తెలియపరుస్తున్నారు. పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసిన తర్వాత వాటిని ధృవీకరిస్తూ ఈ-కేవైసీ పూర్తయ్యాక రైతులకు రసీదులు జారీ చేస్తున్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా కింద నోటిఫై చేయబడిన పంటలకు ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి తద్వారా పంటల బీమా చేయబడిందని స్పష్టంగా పేర్కొనడం విశేషం.

టపాసులు అక్రమంగా నిల్వ ఉంచితే కఠిన చర్యలు



ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: బాణసంచా విక్రయదారులు నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎస్పీ జి.కృష్ణకాంత్ హెచ్చరించారు. దీపావళి పర్వదినాన టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సూచించిన బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్లలో దుకాణాలు ఏర్పాటు చేసుకుని నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. నీరు, ఇసుక, అగ్నిమాపక సామగ్రి టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. లైసెన్స్ కలిగిన దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయాలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా డయల్ 100కు సమాచారం అందించాలని, అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

రిటైర్డ్ డీఆర్వో సూర్యప్రకాష్ మృతి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలో ఆర్డీఓ, డీఆర్వో, జెడ్పీ సీఈఓ, డీఆర్‌డీఏ, డ్వామా పీడీగా పనిచేసి పదవీ విరమణ పొందిన సూర్యప్రకాష్ మంగళవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఆయన స్వస్థలం అనంతపురం జిల్లా ధర్మవరం మండలంలోని ఉప్పునేసిపల్లె. పదవీ విరమణ తరువాత ఆయన అక్కడే నివాసం ఉంటున్నారు. అంత్యక్రియలు గురువారం సొంతూరులోనే నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నూతన ఆలయం.. ఆధ్యాత్మిక శోభితం

- గ్రామీణ ప్రాంతాల్లోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార కాలనీల్లో ఆలయాల నిర్మాణం
- టీటీడీ శ్రీవాణి పథకం ద్వారా ఉమ్మడి జిల్లాకు 32 ఆలయాల మంజూరు
- ఒక్కొక్క ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు
- స్థానిక గ్రామ కమిటీ ప్రతినిధుల పర్యవేక్షణలో నిర్మాణం



పెద్దకోట ఎస్సీ కాలనీలో పూర్తి కావచ్చిన శ్రీ రామాలయం



తెల్లపురిలో చివరి దశలో ఉన్న యాదగిరి నరసింహస్వామి ఆలయం

కర్నూలు కల్చరల్: సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, హిందూ ధర్మ ప్రచారం లక్ష్యంగా తిరుమల తిరుపతి దేవస్థానములు శ్రీవాణి ట్రస్టును ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో నూతన ఆలయాల నిర్మాణం చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార వర్గాలకు చెంది వెనకబడిన ప్రాంతాల్లో వెంకటేశ్వర స్వామి ఆలయం/ రామాలయాల నిర్మాణాలు చేపట్టి భక్తుల చెంతే భగవంతుడు ఉండేలా ముందుకు సాగుతున్నారు. ఒక్కొక్క ఆలయానికి రూ.10 లక్షల చొప్పున ఉమ్మడి జిల్లాలో 32 దేవాలయాల నిర్మాణానికి రూ.3.20 కోట్లు నిధులను వెచ్చిస్తున్నారు. దేవదాయ శాఖ, సమరసత సేవా ఫౌండేషన్ల ఆధ్వర్యంలో దేవాలయాల నిర్మాణం జరుగుతోంది. మూడు విడతల్లో 32 ఆలయాలను గ్రామాల్లోని స్థానిక కమిటీలు నిర్మాణ బాధ్యతలను చేపట్టాయి. ఒక్కొక్క ఆలయాన్ని 10 సెంట్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. దేవతా మూర్తుల విగ్రహాలకు రూ. 2 లక్షలు, ఆలయ నిర్మాణానికి రూ.8 లక్షలు వెచ్చిస్తున్నారు.

మండలాల వారీగా..

మొదటి విడతలో దేవనకొండ మండలంలో 3, మిద్దూరులో 2, పాములపాడులో 1, చాగలమర్రిలో 3, బనగానపల్లెలో 5,అవుకులో1, నంద్యాలలో 1చొప్పున మొత్తం 16 ఆలయాలు నిర్మిస్తున్నారు. రెండో విడతలో గోస్పాడులో 2, కొలిమిగుండ్లలో 1 మొత్తం 3, మూడో విడతలో ఆళ్లగడ్డలో 1, రుద్రవరంలో 1,శిరివెళ్లలో 5, ఉయ్యాలవాడలో1,కొలిమిగుండ్లలో2,పాణ్యంలో 3 చొప్పున మొత్తం 13 ఆలయాలు నిర్మాణం కానున్నా యి. మూడువిడతల్లో 32 దేవాలయాలు నిర్మించనున్నారు.

పనులు వేగంగా సాగుతున్నాయి



దేవదాయ శాఖ పరిధిలో మొదటి విడతలో 13, రెండో విడతలో 2 ఆలయాలు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. స్థానిక కమిటీలు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాయి. కొన్ని ఆలయాల నిర్మాణం పూర్తయ్యింది. మరి కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. త్వరలోనే అన్ని ఆలయాలు భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– శ్రీనివాస ప్రసాద్, డీఈఈ, దేవదాయ శాఖ

నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేస్తాం

మొదటి విడతలో ఒకటి, రెండో విడతలో 3, మూడో విడతలో 13 ఆలయాలు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మొదటి, రెండో విడత ఆలయాల నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. ఇటీవలే మూడో విడతలో ఆలయాలు మంజూరయ్యాయి. వీటికి స్థలాల గుర్తింపు, నిర్మాణ కమిటీలను ఎంపిక చేస్తున్నాం. త్వరలోనే నిర్మాణాలు ప్రారంభం అవుతాయి. నిర్దేశించిన సమయంలోగా నిర్మాణాలను పూర్తి చేస్తాం.

– రామకృష్ణ, ఈఈ, శ్రీశైలం దేవస్థానం

రోషన్‌అలీకి 'లైఫ్‌టైమ్' అవార్డు

- 11న విజయవాడలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేత



కర్నూలు (న్యూటౌన్): ముస్లిం మైనారిటీల హక్కుల సాధనకు కృషి చేస్తున్న రిటైర్డ్ తహసీల్దార్ సయ్యద్ రోషన్‌అలీ ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ అందజేస్తున్న లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 11వ తేదీన విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఈ అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనారిటీ విద్యార్థులకు విద్య, వైద్యం, ఉద్యోగాల కల్పన కోసం తాను కృషి చేసినట్లు చెప్పారు. కర్నూలులో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు కోసం శ్రమించానన్నారు. లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ఈ శ్రామ్‌కు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే ఈ శ్రామ్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు కార్మిక శాఖ సహాయాధికారి కేశన్న బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని, అర్హులు సమీపంలోని సచివాలయం, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికలు, రెవెన్యూ అంశాలపై ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 2, 3 తేదీల్లోపు బీఎల్ఓలు ఇంటింటి సర్వే మరోసారి పూర్తి చేయాలన్నారు. ముసాయిదా జాబితాలో వచ్చే క్లెయిమ్‌లు, అబ్జెక్షన్స్‌ను తప్పనిసరిగా పరిశీలన చేసి పరిష్కరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఉంటే ఓటరు నమోదుకు దరఖాస్తు చేయించాలన్నారు. మీడియాలో ఎన్నికల జాబితాపై వస్తున్న ప్రతికూల వార్తలపై పరిశీలన చేయాలన్నారు. అర్బన్ ప్రాంతాల్లో ఒక్కో లోకేషన్‌లో నాలుగు పోలింగ్ స్టేషన్లకు మించి ఉండకూడదన్నారు. గుర్తింపు పొందిన 6 రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముసాయిదా జాబితాలో జరుగుతున్న మార్పులు, చేర్పులను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో మధుసూదనరావు, ఆర్డీఓలు హరిప్రసాదు, రామలక్ష్మి పాల్గొన్నారు.

కరువు పరిశీలనకు త్వరలో జిల్లాకు కేంద్ర బృందం

- జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో కరువును పరిశీలించేందుకు త్వరలో కేంద్ర బృందం వచ్చే అవకాశాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) పీఎల్ వరలక్ష్మి తెలిపారు. బుధవారం తన చాంబరులో టెక్నికల్ ఏవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలో 24 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించిందన్నారు. ఆయా ప్రాంతాల్లో కరువును ప్రతిబింబించే ఫొటోలు సేకరించాలని పేర్కొన్నారు. నేషనల్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ కింద ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని, ఈ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపుతుందని తెలిపారు. కేంద్ర బృందం పరిశీలించేందుకు ఫొటో ఎగ్జిబిషన్‌కు తగిన ఫొటోలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో సాంకేతిక ఏవోలు శారదమ్మ, అనురాధరెడ్డి, ఉషారాణి, రాఘవేంద్ర, అల్లీపీర తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కొత్తపల్లి: సంతానం కలగలేదనే మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కపిలేశ్వరం గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ జిల్లా మానపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెంది న రామేశ్వరి(23), కపిలేశ్వరం గ్రామానికి చెందిన రామాంజనేయులు ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఏళ్లు గడిచినా సంతానం కలగకపోవడంతో మనోవేదనకు గురైన రామే శ్వరి ఈనెల 6న ఇంట్లో పురుగు మందు తాగింది. కర్నూలులో ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మంగళవారం రాత్రి మృతిచెందింది. కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ అశోక్ తెలిపారు.

శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం
సజ్జలగూడెం (గ్రా), కోసిగి (మం), కర్నూలు జిల్లా.
e-Procurement Tender / NIT No.Q/COE/773/2022 Dt: 01.08.2022
శ్రీ రామాలయం నిర్మాణము కొరకు e-procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు కార్యనిర్వహణాధికారి

శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం
వగరూరు (గ్రా), మంత్రాలయం (మం), కర్నూలు జిల్లా.
e-Procurement Tender / NIT No.Q/COE/773/2022 Dt: 01.08.2022
శ్రీ దేవాలయ పునఃనిర్మాణము కొరకు e-procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు కార్యనిర్వహణాధికారి




ఏనుగు శిల్పం



పాలరాతి మందిరం

అపురూపం.. పాలరాతి మందిరం



ఆకర్షణీయంగా పైకప్పు



మహావీర్‌థామ్ స్వామి మూలవిరాట్

కర్నూలు తుంగభద్ర నది తీరాన్ని ఆనుకుని పంచలింగాల చెక్‌పోస్టు దగ్గర పాలరాతి మందిరం కనువిందు చేస్తోంది. మహావీర్‌థామ్ జైన్ ట్రస్ట్ మండల్ ఆధ్వర్యంలో ఈ మందిరాన్ని సుమారు రెండు ఎకరాల్లో నిర్మించారు. 2004లో ప్రారంభమైన నిర్మాణం 2023 జనవరి 26తో పూర్తయ్యింది. నిర్మాణానికి రాజస్థాన్ రాష్ట్రం మకరాన ప్రాంతం నుంచి పాలరాతి శిల్పాలను తీసుకొచ్చారు. ఆర్చి, ఏనుగు శిల్పాలు, స్తంభాలు, పైకప్పు, గోడలు ఎంతో అపురూపంగా కనిపిస్తున్నాయి.

–సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



కేసీ ఆయకట్టుకు ఊరట!

- మూడురోజులుగా ఎగువ ప్రాంతాల్లో వర్షాలు
- సుంకేసుల బ్యారేజీకి రానున్న వరదనీరు
- తీరనున్న తాగు, సాగు నీటి సమస్య

కర్నూలు (సిటీ): గత మూడు రోజులుగా సుంకేసుల డ్యాంకు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వానలు కేసీ ఆయకట్టు రైతులకు ఊరటనిస్తున్నాయి. పంటలపై ఆశలు రేకెత్తిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులతో గత పది రోజులుగా ఆయకట్టుకు సాగునీటి విడుదల నిలిచిపోయింది. దీంతో బ్యారేజీ నుంచి పడిదెంపాడు గ్రామం వరకు ఉన్న పంటపొలాలకు నీరందని పరిస్థితి. బ్యారేజీలో ఉన్న నీటిని కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగించాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా బ్యారేజీ నుంచి మునగాలపాడు వరకు కేసీ కెనాల్‌కు ఇరువైపులా ఉన్న మోటర్లను పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. దీంతో పాటు జి.శింగవరం సబ్ స్టేషన్ నుంచి ఆ మోటర్లకు విద్యుత్ సరఫరాను సైతం నిలిపివేశారు. అయితే, దీనిపై నాలుగైదు రోజులుగా ప్రతిపక్ష పార్టీలు రైతులను రెచ్చగొడుతూ ఆందోళనలు చేసే ప్రయత్నం చేశారు. వర్షాభావ పరిస్థితులతోనే పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరు ఇవ్వలేకపోతున్నామని మరోవైపు అధికారులు ఆయకట్టుదారులను నచ్చజెబుతున్నారు. ఈ క్రమంలోనే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న వేదవతి (హగరి) నది పరీవాహక ప్రాంతంలో మూడు రోజులుగా కురిసిన వర్షాల వల్ల 2 వేల నుంచి 3 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం నదిలోకి చేరింది. దీనికి ఆర్డీఎస్ ఆనకట్ట ఎగువ భాగంలోని తుంగభద్ర నది పరీవాహక ప్రాంతంలో కురిసిన వాన నీరు కలిసింది. ఇలా మొత్తం 5 వేల క్యూసెక్కులకు పైగా నీటి ప్రవాహం మంగళవారం సాయంత్రానికి ఆర్డీఎస్ ఆనకట్ట దగ్గర ఉన్నట్లు జలవనరుల శాఖ ఇంజినీరింగ్ వర్గాలు తెలిపాయి. సుంకేసుల బ్యారేజీకి రానున్న ఆ నీటి ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు సాయంత్రం కేసీ కాలువకు వెయ్యి క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి వస్తున్న నీటితో నది తీర గ్రామాలతో పాటు కర్నూలు నగరపాలక సంస్థ తాగునీటి అవసరాలు తీరనున్నాయి.

ఈవీఎంల ప్రథమ స్థాయి పరిశీలన పూర్తి



బెల్ ఇంజినీర్లను సన్మానించిన కలెక్టర్ మనజీర్

నంద్యాల: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలన పూర్తయిందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో ఈవీఎంల భద్రత గోడౌన్లో జరుగుతున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలన (ఎఫ్ఎల్‌సీ) చివరి ఘట్టాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్లకు సంబంధించి ఎఫ్ఎల్‌సీ కార్యక్రమాన్ని బెల్ ఇంజినీర్లు, రెవెన్యూ, ఇతర సిబ్బంది నిర్వహించారన్నారు. ఇందులో పార్లమెంట్‌కు సంబంధించి 2030 కంట్రోల్ యూనిట్లు, 2509 బ్యాలెట్ యూనిట్లు, 2452 వీవీ ప్యాట్లు మొదటి దఫా పరిశీలన పూర్తిచేసుకుని ఓటింగ్ ప్రక్రియకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 1,924 కంట్రోల్ యూనిట్లు, 2,520 బ్యాలెట్ యూనిట్లు, 2,451 వీవీ ప్యాట్లు మొదటి దఫా పరిశీలన పూర్తిచేసుకుని ఓటింగ్ ప్రక్రియకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్‌కు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా హాజరయ్యారన్నారు. గత నెల 16వ తేదీ ప్రారంభమైన ఈవీఎంల మొదటి దఫా పరిశీలన ఘట్టం బుధవారంతో ముగిసిందన్నారు. గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంల నిఘా నిమిత్తం సెక్యూరిటీ గార్డ్స్ కోసం నిర్మిస్తున్న షెల్టర్‌ను పరిశీలించారు. ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెక్ విజయవంతంగా పూర్తి చేసినందుకు 14 మంది బెల్ ఇంజినీర్లను, నోడల్ అధికారి, ఎఫ్ఎల్‌సీ సూపర్‌వైజర్ సుబ్బారెడ్డిని కలెక్టర్ సన్మానించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ ONE SITTING : 10th, 12th, B.A., B.Com, B.Sc., PG, B.Ed., Engineering, Pharmacy, Nursing, Agri, VET. From Recog. Universities (For Discont. /Drop out) Exam in Nov/Dec. WES / IQAS / EMBASSY Attestation will be done Cont: ✆ : 73383 76874 [R-142]

■ Regular/Distance/ Discontinued/ Failures/ Direct Final Year: 6 Months Only 10th, 12th, DIPLOMA, B.TECH, M.TECH, BA, B.COM, B.SC, MA, MCOM, MSC, BSW, BLIC, Anisthesia, BBA, BCA, BED, MPED, LLB, MLT, DMLT, OT, MPHW, MBA, MCA, AGBSC, PHD. Cell: 86861 72989 [L-798898]

DISTANCE EDUCATION
■ శ్రీ వెంకటేశ్వర అకాడమి ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా ఒకే సం॥లో 10th, ఇంటర్ (All Groups) కలవు. 100% పాస్ ANU, AU, SV యూనివర్శిటీల ద్వారా డిగ్రీ, పీజీ కోర్సులు కలవు. సి.క్యాంప్, కర్నూలు. 93915 01095 [L-798896]

REAL ESTATE
PLOT FOR SALE
■ నెలసరి కంతులలో కర్నూలు–నంద్యాల రోడ్, తిప్పాయిపల్లె దగ్గర ఓపెన్ ప్లాటు కలవు. & ఓర్వకల్లు MRO ఆఫీస్ దగ్గర ఓపెన్ ప్లాట్లు కలవు. సం.ప్ర: 99638 00314 [L-781110]

■ ఓర్వకల్లు ఎయిర్ పోర్టు వెనుక శకునాల ఇండస్ట్రియల్ హబ్ దగ్గరలో సోలార్ పార్క్ ప్రక్కన, 30x40 (2.75 సెంట్లు) సెంటు 1.20 లక్షలు. ప్లాటు కేవలం 3.30 లక్షలు మాత్రమే. నితిక డెవలపర్స్, 98884 24222 ఏజెంట్లు కావలెను. [L-798884]

LAND FOR SALE
■ ఓర్వకల్లు, ఇండస్ట్రియల్ హబ్ దగ్గర 1 ఎకరా పొలం అమ్మకానికి కలదు. ధర 15 లక్షలు మాత్రమే. సంప్రదించండి: 73965 49373. [L-798894]

SERVICES
■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్ DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు ఖర్చులు. 9990752820. [T-202]

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-1220945]

BUSINESS OFFER
■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 9398448456 [H-193271]

ASTROLOGY
■ శ్రీ వైదీశ్వరన్ కొవిల్ నాడీ జ్యోతిష్యాలయం. మీ బొటన వేలి గుర్తును బట్టి, పుట్టిన తేదీ ఆధారంగా మీ యొక్క భవిష్యత్తు చెప్పి పరిష్కారం చూపబడును. పాతబస్టాండ్, కర్నూలు. 83092 09485. [L-781105]

WANTED
■ SSV బాయ్స్ హాస్టల్ నందు పని చేయుటకు కారు డ్రైవింగ్ అనుభవం కలిగిన సూపర్‌వైజర్ కావలెను. సంప్రదించండి: 63022 42825 [L-798897]

■ Wanted Marketing Executives for Sri Sai Hanuma Homeo Clinic, Near State Bank of India, Central Plaza, KNL. 90594 39929, 91334 03073 [L-781111]

■ WANTED SALES CONSULTANT FOR KUN HYUNDAI CAR SHOW ROOM AUTO NAGAR KURNOOL & NANDYAL Also Contact:(SUBBU 9160114474 KURNOOL & ADONI) (RAFI:8886003134 NANDYAL) [L-798895]

■ కర్నూలు జిల్లా కాల్వబుగ్గ దగ్గరలో గల పుట్టగొడుగుల ఫ్యాక్టరీ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు M/F కావలెను. జీతం 12000. అర్హత: 7రిడిగ్రీ. రూమ్+భోజనం మరియు PF+ESI కలదు. సంప్ర: 96524 47856 [L-1162728]

■ GET SOCIO DIGITAL & BPO SERVICES NEED Telecallers. Timing: 9.30 AM to 5.30 PM, Qualification: No Need of any qualification Just Need Communication Skills. Cont: Sai Vasanth Complex, Birla Compound, KURNOOL. Cell: 88971 75595, 72074 40908 [L-781112]

■ రామకృష్ణ గ్రూపు, (AP No.1) VJA, HYD, శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. AP & TS అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 92814 52828, 6281208656 [B-1206467]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. Ph: 9848571888/9640400073 [HA-794]

■ కస్టలేన్ని కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయు వారు RMP & డాక్టర్స్ కావలెను. జీ : 15000-40000/-ఫ్రీ రూమ్+భోజనం. Hyd.7993583999 [HA-831]

■ అద్భుత అవకాశం Hydలో గల ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫిక్స్డ్ సాలరీ +కమీషన్ +ఇన్సెంటివ్స్ + రూమ్ + భోజనం ఉచితం 10th, ఇంటర్, డిగ్రీ పాస్ ఫెయిల్ సంప్రదించండి. Ph: 7013191934. 7989371766 [H-193326]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.





పెళ్లి సంబంధం కుదరగానే వారి వారి స్థోమత మేరకు
పెళ్లి ఎంత గ్రాండ్‌గా చేయాలనే
ఆలోచన చేస్తుంటారు పెద్దవాళ్లు.
పెళ్లిలో కాబోయే అత్తగారి డిమాండ్ మేరకు
వధువు అమ్మానాన్నలు నడుచుకుంటూ ఉంటారు.
ఇందులో భాగంగా ఇటీవల
మరో కొత్త డిమాండ్ కూడా వచ్చి చేరింది.
కాబోయే పెళ్లికూతురు వివాహ వేడుకలో
దేదీప్యమానంగా వెలిగిపోవాలి.
అందరూ 'అందమైన కోడలిని సెలెక్ట్ చేసుకున్నారు
అనే కితాబులు అందుకోవాలి. అందుకు, ఏ చికిత్స
చేయించుకున్నా సరే!' అంటున్నారు. మరి,
కాబోయే వధువులు వేడుకకు సిద్ధం కావడానికి
ఎలాంటి కేర్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో
అందం పట్ల తీసుకుంటున్న చికిత్సలు..
వికటిస్తున్న పరిమాణాలు ఏమిటి?
భేష్ అనదగిన విధానాలేమిటి?
అనే విషయాలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి.

ఆపరేషన్ బ్యూటీ

పెళ్లి సంబంధాల్లో 'కొత్త' డిమాండ్

''ఓ మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న సుష్మ పెళ్లి వచ్చే డిసెంబర్‌లో జరగనుంది. పెళ్లి ఫిక్స్ అయ్యాక అత్తగారు నవ్వుతూ – 'అమ్మాయీ, నీ వంటి రంగు బ్రైట్ చేయించుకో. ఫెయిర్ నెస్ కోసం ఇంజెక్షన్లు మార్కెట్‌లో దొరుకుతాయని విన్నాను. వాటిని ట్రై చేయి. ఏ ట్రీట్‌మెంట్ అయినా తీసుకో. కానీ, పెళ్లి టైమ్‌కి అందంగా తయారవ్వాలి' అని ఆర్డర్ వేసింది. ఆమె తన కోడలు పందిట్లో చందమామలా కనిపించాలని, కోడలు మొహం చూసి బంధుమిత్రులంతా నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటుంది. 'అత్తగారి డిమాండ్ ఇప్పుడు నాకు ఆందోళన కలిగిస్తోంది' అంటోంది సుష్మ. ఇందుకోసం బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌తో పాటు చర్మ ఛాయలో కూడా తేడా వచ్చేలా మార్పులు చేసుకోవడానికి తెగ కష్టపడుతోంది. 'పెళ్లి అంటేనే ఎంతో ఉత్సాహం. ఫొటోల్లో, వీడియోల్లో బాగా కనిపించాలని, అందరిలో ప్రత్యేకంగా వెలిగిపోవాలని నాకూ ఉంటుంది. ఇందుకు బ్యూటీ పార్లర్స్‌కి వెళ్లడం, మేకప్ చేయించుకోవడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, ఇప్పుడు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్స్ కూడా చేయించుకోవాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులే కాకుండా ఈ కొత్త తరహా ఖరీదైన ఖర్చు తలనొప్పిగా మారింది అంటున్నారు అమ్మానాన్నలు' అని బాధపడుతోంది సుష్మ.

★ ★ ★

కాబోయే అత్తగారు కోరడంతో రూప (పేరు మార్చడమైంది) తన కంటి కింది భాగం లోతుగా ఉండటం వల్ల 'అండర్ ఐ ఫిల్లర్' ఇంజక్షన్ చేయించుకుంది. దీంతో కంటి కింది భాగంలో రక్తం గడ్డకట్టి, వాపు వచ్చి, బయటకు రాలేని పరిస్థితి. త్వరలో పెళ్లి. ఆ క్లాట్ అంత తొందరగా తగ్గదు. దిక్కుతోచని పరిస్థితి.

★ ★ ★

శిల్ప అందం కోసం బొటాక్స్ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. డోస్ ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వీలు లేకుండా మారిపోయింది.

★ ★ ★

అందం పెంచుకునే విషయంలో ఒకరో ఇద్దరు కాదు అమ్మాయిలు ఎప్పుడూ తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లి అంటే చెప్పనక్కర్లేదు. ప్రీ వెడ్డింగ్ షూట్ నుంచి ప్రతి సంబరాన్నీ పదిలపరుచుకోవడానికి ఎన్నో పాట్లు పడతారు. దీంట్లో భాగంగా బ్యూటీ కాన్షియస్ అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ పెరిగింది. ఈ విషయంలో ఎలాంటి చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడం మంచిది అంటున్నారు డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వప్న ప్రియ. వాటిలో...

ఇంట్లో ప్రయోగాలు..

చాలా మంది అందానికి ఇంటి చిట్కాలు పాటిస్తుంటారు. సహజంగా లభించే వాటితో బ్యూటీప్యాక్‌లు వేసుకుంటూ ఉంటారు. వాటి ద్వారా ఎంత సమయంలో ఎంత ప్రయోజనం ఉంటుందో కూడా చూడాలి. ఎందుకంటే, కొంతమందికి స్కార్స్, పింపుల్స్, యాక్నె, డల్ స్కిన్, కలర్ ఛేంజ్, చుండ్రు... ఇలా చాలా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వాటికి చికిత్సనే సరైన మార్గం. ఆహారానికి సంబంధించినవి తప్పనిసరిగా పెళ్లికి రెండు నుంచి మూడు నెలల ముందు మార్పులు చేసుకోవాలి. సహజంగా చర్మంలో మార్పులు రావాలంటే పోషకాహారం మంచి ఎంపిక. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది.

బ్యూటీ స్పాలో చికిత్స మంచిదేనా?

స్కిన్ టైటనింగ్, రింకిల్స్, స్కిన్ హైడ్రేషన్.. వంటి ట్రీట్‌మెంట్స్ బ్యూటీ స్పాలలో చేయించుకుంటారు. దీనికి కూడా ముందు సరైన కౌన్సెలింగ్ అవసరం. ఒక్కో వ్యక్తి చర్మ తత్త్వం ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విధానంలో చర్మం రికవరీ అవడానికి కూడా సమయం పడుతుంది.

ఇంజక్షన్లు సరైనవేనా...

కృత్రిమంగా కొలాజన్, స్కిన్ బూస్టర్స్.. అని తీసుకుంటున్నారు. ఎవరో చెప్పారని కొంతమంది నర్సులను ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్లు చేయించుకుంటారు. మంచి లుక్ కోసం ట్రై చేయచ్చు. కానీ, వాటి డోసుల్లో తేడాలొస్తే మొత్తం తిరగబడుతుంది.

ఆన్‌లైన్‌లో చూసి ...

సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆన్‌లైన్‌లో బ్యూటీ ఉత్పత్తులు తెప్పించుకొని, అప్లై చేసుకోవడం చూస్తుంటాం. వాటి వల్ల ఇబ్బందుల పాలైన వారు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, అవి వారికి ఎంత వరకు నప్పుతాయో తెలియదు.

కెమికల్ పీలింగ్

కెమికల్ పీల్‌లో బయటి నుంచి చర్మంలోకి ఎలాంటి రసాయనాలు చొప్పించరు. మృతకణాలను తొలగిస్తారు, చర్మం పై పొర నుండి టానింగ్, పిగ్మెంటేషన్ తగ్గి కొత్త పొర కనిపిస్తుంది. అయితే, దీని ద్వారా చర్మంపై కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిపుణుల సలహా అవసరం. ఇంకొన్ని పీఆర్‌పీ చికిత్సలు చర్మ నిగారింపును తీసుకువస్తాయి. అయితే, వధువులు కాబోయే అమ్మాయిలు పెళ్లికి 3 నుండి 6 నెలల ముందు ఈ కాస్మెటిక్ విధానాలను ప్రారంభించాలి. ఎందుకంటే వారి సిట్టింగ్‌లలో కనీసం 3 వారాల గ్యాప్ ఉండాలి.

లైటర్ టోన్‌లకు డిమాండ్

పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలు తమ ప్రీ–బ్రైడల్ విధానంలో రంగు ఫెయిర్‌గా మారడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిజానికి, సూర్యకిరణాల నుండి మన చర్మాన్ని మనం రక్షించుకోనప్పుడు, చర్మంలో పాచెస్ ఏర్పడతాయి. కొన్నిసార్లు సూర్యకాంతి కుడి వైపున, మరి కొన్నిసార్లు ఎడమ వైపున ఎక్కువగా పడుతుంది. సూర్యుని అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. పిగ్మెంటేషన్‌ను ప్రేరేపిస్తాయి. దీంతో అంతటా 'చర్మపు రంగు' ఒకే విధంగా ఉండదు. అంటే ముఖం మీద చాలా చోట్ల టాన్ ఉంటుంది. ఈవెన్ టోన్‌ని కలిగి ఉండాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖంపై సన్‌స్క్రీన్‌ని అప్లై చేయడం చాలా ముఖ్యం.

కాస్మెటిక్ ఫిల్లర్స్...

నిఖిత పెదవులు చాలా సన్నగా ఉంటాయి. రంగు చాలా తక్కువ. ఒకరోజు ఆమె కాబోయే అత్తగారు ఫోన్ చేసి 'నీ ముఖంలో పెదవులు కనిపించడం లేదు. ఏదైనా చికిత్స తీసుకో' అంది. దీంతో నిఖిత నర్సులను కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లను ఆశ్రయించింది. దీనిని లిప్ ఫిల్లర్ అని కూడా అంటారు. దీర్ఘకాలిక ఫలితాల కోసం, ప్రతి 6 నుండి 8 నెలలకు ఇంజెక్షన్లు చేయాలి. కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లే కాకుండా, హైలురానిక్ యాసిడ్ ఫిల్లర్ ఇంజక్షన్లు కూడా ఈ రోజుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ డెర్మా ఫిల్లర్‌లతో పెదవులు హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పగుళ్లు రావు, పూర్తి పరిమాణంలో కనిపిస్తాయి. అలాగే, కొందరు అమ్మాయిలు అత్తింటి వారు బరువు తగ్గమన్నారు కదా అని లైపోసక్షన్ వంటి చికిత్సలు చేయించుకుంటారు. దీని వల్ల చర్మంపై చారలు ఏర్పడతాయి. అవి అంత త్వరగా పోవు. ముక్కు, పెదాలు, బ్రెస్ట్ సరిచేసుకోవడానికి కాస్మెటిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు. ఏ చికిత్స అయినా కనీసం ఆరు నెలల ముందు చేయించుకుంటే వచ్చే సైడ్‌ఎఫెక్ట్‌నూ నివారించవచ్చు.

సహజమైన మెరుపే మేలు


డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ దర్మటాలజిస్ట్

పెళ్లి 10-15 రోజులు ఉందనగా ఏ బ్యూటీ ట్రీట్‌మెంట్ చేయించుకోకూడదనే విషయం ముందు గ్రహించాలి. కనీసం ఆరు లేదా మూడు నెలల ముందు బ్యూటీ చికిత్సలు చేయించుకోవచ్చు, దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే నివారించుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ అందాన్ని ఎవరూ ఇష్టపడరు. ఎప్పుడైనా సహజమైన మెరుపును ఇచ్చే బ్యూటీ ట్రీట్‌మెంట్ మాత్రమే మంచిదని గమనించాలి. అయినా తప్పదు అనుకునేవారు స్కిన్ బూస్టర్స్, ఇతర ట్రీట్‌మెంట్ వైపుగా వెళ్లచ్చు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణ అవసరం.

టిప్

డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ఇస్తున్నారా?



దీపావళికి డ్రైఫ్రూట్స్‌ను గిఫ్ట్‌గా ఇస్తుంటారు చాలామంది. అయితే డ్రైఫ్రూట్స్‌ను కొనేటప్పుడు కచ్చితంగా ఇవి గమనించుకోవాలి.

- నట్స్ రంగు ఎలా ఉందో చూడాలి. సహజంగా ఉండాల్సిన దానికంటే మరింత ముదురు రంగులో ఉంటే అవి పాడైనట్టు. రుచిగా కూడా ఉండవు కాబట్టి కొనకపోవడమే మంచిది.
- వీలైతే ఒకటి రెండు నట్స్‌ను నీటిలో వేసి, పదినిమిషాల తరువాత కొరికి చూడాలి. నానిన తరువాత కూడా గట్టిగా ఉంటే అవి చాలా పాతవి. ఇవి ఆరోగ్యానికి అంత మంచిది కాదు కాబట్టి తీసుకోకూడదు. చాలా షాపులు తినడానికి శాంపిల్స్ ఇవ్వవు. ఇలాంటప్పుడు ఆ డ్రైఫ్రూట్స్‌ను తక్కువ పరిమాణంలో కొనుక్కుని పరిశీలించాలి
- నట్స్‌ని వాసన చూడాలి. ఘాటైన వాసన వస్తే అవి చాలా పాతవి. వీటికి కొద్దిగా తేమ తగిలితే వెంటనే బూజు పట్టి త్వరగా పాడవుతాయి. ఇవి తినడం ఆరోగ్యానికి మంచిది కాదు
- నట్స్ ప్యాకెట్ మీద ఎఫ్ఎస్ఎస్ఏఐ ముద్ర, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి. ఎప్పుడు ప్యాకింగ్ అయ్యింది? ఎప్పటిలోగా తినాలో సూచించే డేట్స్‌ను సరిగా చూసుకోవాలి. ఈ డేట్స్ ముద్రించని ప్యాకెట్స్‌ను కొనకూడదు
- ప్యాకెట్ మీద ముద్రించిన సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. ప్రిజర్వేటివ్‌లు కలిపిన నట్స్‌ను కొనకపోవడమే మంచిది.

దుర్గ ఇండియా



ప్రతి స్త్రీ దుర్గ వలే...

**ప్రతి స్త్రీలో ఒక దుర్గ ఉంటుంది.
కాని ఆ దుర్గను అదిమి పెట్టేలా కుటుంబం,
సమాజం ఆమెను తీర్చి దిద్దుతాయి.
దాంతో తన మీద ఏ అన్యాయం జరిగినా
చెప్పలేని స్థితికి చేరుతుంది.
'నువ్వు దుర్గవి. పోరాడు'
అని చెప్తారు బెంగళూరులోని
'దుర్గ ఇండియా' టీమ్ సభ్యులు.
ప్రియా వరదరాజన్ అనే యాక్టివిస్ట్
ఏర్పాటు చేసిన ఈ గ్రూప్
స్త్రీలను కుటుంబ హింస నుంచి...
లైంగిక వేధింపుల నుంచి కాపాడటానికి
పని చేస్తోంది. వారి పోరాటానికి శక్తినిస్తోంది.**

'ప్రతి ఒక్కరూ మార్పు కోసం ఎదురు చూస్తారు. మనమే మార్పు కోసం ప్రయత్నిద్దామని ఎందుకు అనుకోరు... ఎదురు చూస్తూ కూచుంటే మార్పు వస్తుందా?' అంటారు ప్రియా వరదరాజన్.

బెంగళూరులో 'దుర్గ ఇండియా' అనే సంస్థ స్థాపించి స్త్రీల సమస్యలపై పని చేస్తున్న ప్రియ ఇటీవల బెంగళూరు మాల్‌లో ఒక వ్యక్తి స్త్రీలను అసభ్యంగా తాకడం గురించి ప్రస్తావిస్తూ 'పబ్లిక్ ప్లేసుల్లో– బహిరంగ ప్రదేశాల్లో గాని ఆన్‌లైన్‌లోగాని స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్య తీసుకునేందుకు ఆ బాధిత మహిళకు అండగా నిలవడం మేము చేసే పని. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు, మహిళా పోలీసులు ఎందరు ఉన్నా మహిళలకు సాటి మహిళ అండగా ఉంటే కలిగే ధైర్యం వేరు. తోటి మహిళలతో వారు చెప్పుకునేవి వేరు. అలాంటి వారికి యోగ్యులైన కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ చేయించి దిలాసా ఇప్పిస్తాము. అంతే కాదు బాధితులను వెంటబెట్టుకొని– ఆ స్టేషన్‌కుపో ఈ స్టేషన్‌కు పో అనే బాధ లేకుండా బెంగళూరులో వన్ స్టాప్ సెంటర్స్‌లో ఫిర్యాదు చేయిస్తాము. తోడుగా మేమొస్తే బాధితులు ఫిర్యాదు చేయడానికి జంకరు. ఎటొచ్చీ వారికి తోడు నిలిచే స్త్రీల బృందాలు అన్నిచోట్లా ఉండాలి' అంటుంది ప్రియ.

ఐ యామ్ ఎవ్రి ఉమన్

పదేళ్ల క్రితం ప్రియా వరదరాజన్ 'ఐ యామ్ ఎవ్రి ఉమన్' పేరుతో ఒక బ్లాగ్ రాయడం మార్పు కోసం ఆమె వేసిన మొదటి అడుగు. ఆ బ్లాగ్‌కు క్రమంగా చాలామంది మహిళా ఫాలోయర్లు వచ్చారు. వారు తమ అనుభవాలను ప్రియతో పంచుకోసాగారు. 'అందరిదీ ఒకే కథ. అందరూ మరొక స్త్రీ లాంటి వారే అని నాకు అర్థమైంది. స్త్రీల కోసం పని చేయాల్సిన అవసరం తెలియజేసింది. స్త్రీల కోసం పని చేయడం అంటే వారి పట్ల భావజాలాన్ని మార్చడమే' అంటుంది ప్రియ.

మగాడు ఎందుకు అలా చేస్తాడు?

'గతంలో సమాజంలో స్త్రీలకు ఏదైనా సమస్య వచ్చి ఆమె బయటకు చెప్పినప్పుడు– ఆమెలో ఏ దోషం ఉందో అన్నట్టుగా నిందను ఆమె మీదే వేసేవారు ఉండేవారు. వారి భావజాలాన్ని మార్చడమే చేయవలసింది. స్త్రీకి ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఆ మగాడు ఆమెతో అలా ఎందుకు చేశాడు అని ఆలోచించేలా చేస్తే సగం మార్పు వచ్చినట్టే. ఇంట్లో, వీధిలో, ఆఫీసులో స్త్రీలు ఆత్మాభిమానంతో ఉండాలంటే మగాళ్లు మారాలి. అందుకు ఒక రోజు సరిపోదు. ఒకరు పని చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరం ఏదో ఒక మేరకు పని చేయాల్సిందే' అంటుంది ప్రియ.



అందరినీ 'దుర్గ'లుగా మారుస్తూ

అన్యాయం జరిగితే వెరవకుండా ప్రతిఘటించమని ప్రియ ఆధ్వర్యంలో 'దుర్గల' బృందం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్కూళ్లలో, కాలేజీలలో, బస్తీలలో తిరుగుతూ స్త్రీలకు తమ హక్కులను, చట్టపరమైన రక్షణను, సహాయం చేసే బృందాలను తెలుపుతుంది. 'నేను ఒంటరిదాన్ని కాను అని స్త్రీ అనుకుంటే చాలు... ఆమె పోరాడగలదు' అంటుంది ప్రియ.

ఇంత ప్రయత్నం చేసే ప్రియ లాంటి వారి సంఖ్య ఎంత పెరిగితే దుర్గలకు అంత శక్తి పెరుగుతుంది.

ఖుషీతో దిల్ ఖుష్



చిన్నతనంలో తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని వారికి నొప్పి తెలియకుండా ఎంతో కష్టపడి పెంచుతారు తల్లిదండ్రులు. అయితే లక్నోకు చెందిన ఖుషీ అందుకు భిన్నం. తన తండ్రిలా మరెవరూ కష్టపడకూడదని తానే ఓ సామాజిక కార్యకర్తగా మారి సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఖుషీ పాండే.

లక్నోకు చెందిన 23 ఏళ్ల ఖుషీ పాండే బాల్యం ఉన్నావ్ అనే ఊళ్లో గడిచింది. తన తండ్రి నుంచి చిన్ననాటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఖుషీ తండ్రికి బాగా చదువుకోవాలని ఉండేది. కానీ పెన్సిల్ కొనే స్థోమత కూడా లేదప్పుడు. ఈ విషయం తెలుసుకుని, నాన్నలా మరెవరూ చదువుకోసం ఇబ్బంది పడకూడదు అనుకుంది. నిరుపేదలకు సాయం చేయాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకుంది.

ఖుషీ పెద్దయ్యేసరికి నాన్న వాళ్ల లక్నోకి మకాం మార్చారు. అక్కడ ఓ షాపులో పనిచేస్తూ తరువాత కాంట్రాక్టర్‌గా మారారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టులు కూడా రావడంతో ఖుషీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఖుషీ 'లా' పూర్తయ్యాక, సోషల్ వర్క్‌లో పీజీ చేసింది. చదువు పూర్తయ్యాక వెంటనే నిరుపేదలకు చదువు చెప్పడం ప్రారంభించింది. మురికివాడల్లోని పిల్లలను ఒక చెట్టుకింద కూర్చోబెట్టి సాయంత్రం రెండుమూడు గంటలు చదువు చెప్పేది. రోజుకి యాభై మంది వరకు ఖుషీ క్లాసులకు హాజరయ్యేవారు. తన దగ్గరకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తోంది.

తాతయ్య మరణంతో...

అది 2020 ... ఒకరోజు రాత్రి ఖుషీ వాళ్ల తాతయ్య షాపు నుంచి తిరిగి వస్తున్నారు. చీకట్లో సరిగా కనిపించక ఎదురుగా వచ్చే కారు తాతయ్య సైకిల్‌ని ఢీ కొట్టడంతో ఖుషీ తాతగారు అక్కడికక్కడే చనిపోయారు. తాతయ్యను ఎంతో ఇష్టపడే ఖుషీ ఈ చేదు సంఘటనను తట్టుకోలేకపోయింది. సైకిల్‌కు లైట్ ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు అనుకుని ప్రతి సైకిల్‌కు లైటు ఉండాలని భావించింది. రోజూ కూలి పనిచేసుకునేవారు తమ సైకిళ్లకు లైట్లు పెట్టుకోవడానికి తగ్గ స్థోమత ఉండేది కాదు. దాంతో వాళ్లకు ఒక్కొక్కరికి 350 రూపాయల ఖరీదు చేసే లైట్లను ఉచితంగా పంచింది. ఇలా ఇప్పటిదాకా 1500 మంది వాహనాలకు బ్యాటరీతో నడిచే లైట్లను అమర్చింది. లైట్లు అమర్చడానికి 'ఇన్‌స్టాల్ లైట్స్ ఆన్ బైస్కిల్' అని రాసిన ఉన్న ప్లకార్డు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఎంతోమందికి అవగాహన కల్పించింది. అప్పట్లో ఖుషీ చేసిన ఈ పనిని ఓ ఐఏఎస్ అధికారి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఈ విషయం తెలిసిన ఎనభైమంది యువకులు ఖుషీతో కలిసి సైకిళ్లు, ట్రక్కులకు, ఇతర వాహనాలకు లైట్లు అమర్చడంలో ఖుషీకి సాయంగా నిలిచారు.





పాఠాలతో పైసలు సంపాదించి...

ఖుషీ చేస్తోన్న సామాజిక కార్యక్రమాలకు నిధులు చాలా కావాలి. ఇందుకు తన తండ్రి, బంధువులు సమకూర్చిన మొత్తం ఏమాత్రం సరిపోలేదు. దాంతో యూట్యూబ్‌లో 'లా' తరగతులు చెప్పడంతోపాటు, ఇతర పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ నెలకు అరవై నుంచి డెబ్బై వేల వరకు సంపాదించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

మహిళలకు అండగా...

బాలికలకు శానిటరీ ప్యాడ్ ల గురించి అవగాహన కల్పించడం, విద్యుత్ సదుపాయం లేని వారికి సోలర్ ల్యాంప్స్ అందించడం, 'జీవిక సాథీ' ప్రాజెక్టు పేరుతో దివ్యాంగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్, జ్యూవెలరీ తయారీలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఫస్ట్ టైమ్

మంత్రముగ్ధులను చేసే దాస్తాంగోయి


ఫౌజియా

**'దాస్తాంగో ప్రదర్శన ఇస్తున్నది ఓ అమ్మాయా!!' అని బోలెడు ఆశ్చర్యపడుతూనే ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు ఒక ప్రేక్షకుడు. ఇలా కూర్చొని అలా వెళ్లిపోదాం... అనుకున్నాడు. అయితే ప్రదర్శన పూర్తయ్యే వరకు కదలకుండా కూర్చున్నాడు.
ఆ హాల్‌లో నవ్వుల్లో నవ్వు అయ్యాడు. ఏడుపులో ఏడుపు అయ్యాడు. సకల భావోద్వేగాల సమ్మేళనంతో 'దాస్తాంగోయి' ఫౌజియాను ఆశీర్వదించాడు. ఉర్దూలో మౌఖిక కథాసాహిత్య కళారూపం... దాస్తాంగో.
పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ కళారూపంలో అపారమైన పేరు తెచ్చుకొని 'ఫస్ట్ ఫిమేల్ దస్తాంగోయి'గా గుర్తింపు పొందింది ఫౌజియా...**

దిల్లీకి చెందిన ఫౌజియాకు స్కూల్ రోజుల నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. స్కూల్లో ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనేది. ఫౌజియా తండ్రి మోటర్‌బైక్ మెకానిక్. ఆర్థిక పరిస్థితి రీత్యా ఫౌజియా ఎప్పుడో చదువు మానేయాలి. ట్యూషన్‌లు చెప్పగా వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసింది.

దయాల్ సింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరోజు తొలిసారిగా 'దాస్తాంగో' ప్రదర్శన చూసింది ఫౌజియా. ఇక అప్పటి నుంచి 'దాస్తాంగో'పై ఆసక్తి, అభిమానం పెరిగాయి. తాను కూడా 'దాస్తాంగోయి'గా పేరు తెచ్చుకోవాలనుకుంది. 'ఇది పురుషులకు మాత్రమే పరిమితమైన కళారూపం. మహిళలు చేయలేరు. ఒకవేళ చేసినా ప్రేక్షకులు ఆదరించరు' అన్నట్లుగా చాలామంది మాట్లాడారు. ఆ మాటలు విని ఫౌజియా కొంచెం కూడా నిరాశపడలేదు. తనపై తనకు గట్టి నమ్మకం ఉంది.

'జీవితాంతం దాస్తాంగో చెంతనే ఉండాలనుకున్నాను. ఎంతో చరిత్ర ఉన్న ఈ కళ గురించి ఈ తరంలో కొద్ది మందికి మాత్రమే తెలుసు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ తరానికి కూడా తెలిసేలా దాస్తాంగోకు ప్రాచుర్యం తీసుకురావాలనుకున్నాను' అంటుంది ఫౌజియా.


డానీష్ హుస్సేన్, మహ్మద్ ఫారూఖీ లాంటి గొప్ప కళాకారుల నుంచి 'దాస్తాంగో'ను నేర్చుకుంది ఫౌజియా. ఫౌజియా కథాసంవిధానంలో కృత్రిమమైన భాషా గాంభీర్యం వినిపించదు. పాత దిల్లీ యాస మాత్రమే వినిపిస్తుంది.

'మన దేశంలో ఎన్నో భాషలకు సంబంధించి ఎన్నో మాండలికాలు ఉన్నాయి. ప్రతి మాండలికానికి తనదైన సొగసు ఉంటుంది. ఈతరంలో చాలామంది తమ యాసను దాచి పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది సరి కాదు. మన ఊరు, తల్లిదండ్రులు, సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకున్నట్లే మన మాండలికం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి' అంటుంది ఫౌజియా.

ఫౌజియాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ముఖ్యంగా ఉర్దూ సాహిత్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు...'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

జానపద కథలు మాత్రమే కాకుండా సామాజిక సందేశం ఉన్న ఆధునిక కథలను కూడా చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఫౌజియా. దేశవిభజన సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు, హింస గురించి కథగా చెబుతున్నప్పుడు ప్రేక్షకులు కదిలిపోయారు. కోవిడ్ కల్లోల సమయంలో ఫౌజియాకు 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వడానికి కుదరలేదు. దీంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే ప్రదర్శన ఇచ్చింది.

అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు... 'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.



మహాభారతం కథల నుంచి స్వాతంత్ర్యం కోసం మహాత్ముడి పోరాటం వరకు 'దాస్తాంగోయి'గా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఫౌజియాకు ఉర్దూ భాషలోనే కాదు హిందీ, ఇతర భాషలలోనూ 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వాలనేది కల. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.